## మాజీ సర్పంచుల ముందస్తు అరెస్ట్

నాగారం: పోలీసుల అదుపులో మాజీ సర్పంచులు

మాజీ సర్పంచ్ శిలిషాకొండారెడ్డిని హౌస్ అరెస్ట్ చేసిన పోలీసులు

నాగారం, ఫిబ్రవరి 5: ప్రభుత్వం పెండింగ్‌లోని బిల్లులను చెల్లించాలని డిమాండ్ చేస్తూ అసెంబ్లీ ముట్టడికి బయలుదేరిన మాజీ సర్పంచులను బుధవారం స్థానిక పోలీసులు అరెస్టు చేశారు. అరెస్టయిన వారిలో యారాల నర్సింహారెడ్డి, సుధాకర్, గట్టు నర్సింహారావు, షేక్ నాగుల్‌మీరా ఉన్నారు.

హుజూర్‌నగర్ రూరల్: వేపలసింగారం మాజీ సర్పంచ్ అన్నెం శిరీషాకొండారెడ్డిని పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారు.

## 'బీఆర్ఎస్ పార్టీపై ఆరోపణలను ఖండిస్తున్నాం'

మాట్లాడుతున్న బెల్లంకొండ చిన్నవెంకన్న

మునగాల, ఫిబ్రవరి 5: మండలంలోని కలకోవ గ్రామంలో మంగళవారం రాత్రి జరిగిన గొడవతో బీఆర్ఎస్ నాయకులకు ఎటువంటి సంబంధం లేదని ఆ పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు బెల్లంకొండ చిన్నవెంకన్న తెలిపారు. బుధవారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. గ్రామానికి చెందిన సీపీఎం నాయకులు కావాలనే బీఆర్ఎస్ పార్టీ నాయకులపై సోషల్ మీడియాలో ఆరోపణలు చేస్తున్నారని, వాటిని ఖండిస్తున్నామని అన్నారు. సీపీఎం గ్రామ కార్యదర్శి ఒక పక్క, మరోపక్క కాంగ్రెస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి ఉండి దాడి చేసుకున్నారని తెలిపారు. కొందరు చీడపురుగులు పనికట్టుకొని మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్‌పై ఆరోపణలు చేస్తున్నారని, గ్రామంలో బీఆర్ఎస్ పార్టీ ఎదుగుదలను చూసి ఓర్వలేక అలజడులు సృష్టిస్తున్నారని అన్నారు. బీఆర్ఎస్ నాయకులు తొండల లింగయ్య, మునగలేటి నవీన్, కుక్కడపు సైదులు పాల్గొన్నారు.

## 'ఏకసభ్య కమిషన్ నివేదికతో మాలలకు అన్యాయం'

సూర్యాపేట టౌన్, ఫిబ్రవరి 5: ఎస్సీ వర్గీకరణపై రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఏకసభ్య కమిషన్ ఇచ్చిన నివేదికతో మాలలకు తీరని అన్యాయం జరుగుతున్నదని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి కో-కన్వీనర్ బొల్లెద్దు దశరథ, నాయకుడు కట్ట సైదులు అన్నారు. కమిషన్ నివేదికను వ్యతిరేకిస్తూ బుధవారం స్థానిక రైతుబజార్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నివేదిక ఒక వర్గానికి న్యాయం చేసి మరో వర్గానికి అన్యాయం చేసేలా ఉందన్నారు. ప్రభుత్వం దళితులను విడదీసి వారి అభివృద్ధికి ఆటంకం కలిగించే ప్రయత్నాలు చేస్తున్నదని విమర్శించారు. నాయకులు అశోద రవి, చింతపల్లి వెంకటేశ్వర్లు, నామ నాగయ్య, ఎ.జానకిరాములు, రామకృష్ణ, భద్రాచలం, జి.మల్లయ్య, శివయ్య, టి.విజయ్, బి.అఖిల్, రాములు, జి.వికాస్, జి.వెంకన్న, జె.కరుణాకర్ పాల్గొన్నారు.

## వేసవిలో నీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు : ఏఈ

నడిగూడెం, ఫిబ్రవరి 5: వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు తీసుకుంటామని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఇర్ఫాన్ తెలిపారు. బుధవారం మండలంలోని తెల్లబెల్లి, ఈకేపేట గ్రామాల్లో మిషన్ భగీరథ ట్యాంక్‌లను ఆయన పరిశీలించి మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఇమామ్, ఎంపీఓ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని వినతి

వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

గరిడేపల్లి, ఫిబ్రవరి 5: మండలంలోని అబ్బిరెడ్డిగూడెం స్టేజీ వద్ద నిత్యం ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని, ప్రమాదాల నివారణకు ఆర్‌అండ్‌బీ అధికారులతో మాట్లాడి స్టేజీ వద్ద స్పీడ్ బ్రేకర్లు, సిగ్నల్ లైట్లు ఏర్పాటు చేయించాలని కోరుతూ పలు పార్టీల నాయకులు బుధవారం ఎస్ఐ చలికంటి నరేశ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి షేక్ యాకూబ్ మాట్లాడుతూ.. సంవత్సర కాలంలో 13 ప్రమాదాలు జరిగి 9 మంది చనిపోయారని, నివారణ చర్యలు చేపట్టకపోతే రానున్న రోజుల్లో ప్రమాదాలు పెరిగే అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు కీసర నాగయ్య, దేవరం సైదిరెడ్డి, గోపతి వీరయ్య, మదారు, పెంటయ్య, సంద్ర వీరయ్య పాల్గొన్నారు.

## 'బీసీలకు 50 శాతం రిజర్వేషన్ కల్పించాలి'

హుజూర్‌నగర్, ఫిబ్రవరి 5: చట్టసభల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్ కల్పించాలని బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధనుంజయ్ నాయుడు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ఆర్డీఓ కార్యాలయం ఎదుట బీసీ హక్కుల సాధన సమితి ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి ఆర్డీఓ శ్రీనివాసులుకు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీసీల సంక్షేమ కోసం ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలని అన్నారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర రైతు సంఘ జిల్లా అధ్యక్షుడు కంబాల శ్రీనివాస్, కందుల వెంకటేశ్వర్లు, జక్కుల రమేశ్, అంజయ్య, శ్రీనివాస్ పాల్గొన్నారు.

## 'వట్టికోట ఆళ్వార్‌స్వామి సేవలు చిరస్మరణీయం'

ఆళ్వార్‌స్వామి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న గ్రంథాలయ చైర్మన్ రామారావు

సూర్యాపేట టౌన్, ఫిబ్రవరి 5: గ్రంథాలయాల అభివృద్ధికి వట్టికోట ఆళ్వార్‌స్వామి అందించిన సేవలు చిరస్మరణీయమని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వంగవీటి రామారావు అన్నారు. బుధవారం వట్టికోట ఆళ్వార్ స్వామి వర్ధంతి సందర్భంగా జిల్లా కేంద్రంలోని గ్రంథాలయంలో ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ.. తెలంగాణ గ్రంథాలయోద్యమంలో ఆళ్వార్‌స్వామి ప్రజలను చైతన్య పర్చారని గుర్తుచేశారు. కార్యక్రమంలో గ్రంథ పాలకులు వి.శ్యాంసుందర్‌రెడ్డి, కె.విజయభాస్కర్, పి.సృజన, సిబ్బంది, పాఠకులు పాల్గొన్నారు.

బహిరంగ ప్రకటన

ఇందుమూలముగా యావన్మంది ప్రజలకు తెలియజేయునది ఏమనగా నా క్లయింట్స్ అయినటువంటి 1) బచ్చంకూరి సాయి యశస్వి, తండ్రి. శరత్ చంద్ర. 34 సం॥లు, 2) బచ్చంకూరి స్నిగ్ధ, తండ్రి. శరత్‌చంద్ర, 36 సం॥లు ఉభయులు నివాసము చైతన్యపురి, హైదరాబాద్ వారి సూచనల మేరకు ఈ నోటీస్ ఇవ్వనైనది.

పైన తెలిపిన మా క్లాయింట్స్ నల్గొండ జిల్లా, మిర్యాలగూడ గ్రామం, తెర్కెళ్లపహాడ్ గ్రామస్తులు మైనం చంద్రశేఖర్, తండ్రి. సోమయ్య, వయస్సు. 43 సం॥లు, వృత్తి. వ్యాపారము, 2) హుర్యాపట్ల జిల్లా, మర్రిగూడ మండలం, మర్రిగూడ గ్రామ కార్యదర్శులు షేక్ అబ్దుల్ రజాక్, తండ్రి. అబ్దుల్ సాహెబ్, వృత్తి. వ్యవసాయము. 3) సూర్యాపేట జిల్లా, మర్రిగూడ మండలం, మర్రిగూడ గ్రామ కాపుదర్శులు సయ్యద్ మీరాజ్ అహ్మద్, తండ్రి. రజాక్, వృత్తి. వ్యవసాయము వారి వద్ద నుండి ఈ దిగువ నోటీస్ షెడ్యూల్డ్ భూమి కొనుగోలు చేయుటకు ధర నిర్ణయించుకొని, తేది. 19-01-2025న కొత్త మొత్తము డబ్బు చెల్లించి విక్రయ అగ్రిమెంట్ పొంది ఉన్నారు. ఇట్టి అగ్రిమెంట్ ప్రకారముగా ది. 19-02-2025లోపల కొంత ప్రకారంగా తేలిన భూమికి అగ్రిమెంట్ ప్రకారముగా నిర్ణయించుకున్న ధరకు మిగతా డబ్బు చెల్లించి రిజిస్ట్రేషన్ చేసుకునే ఖరారు. కావున ఇట్టి గడువు లోపల మా క్లయింట్స్ కొంత చెలించుకొని మిగతా పైనము తదనుగుణంగా చెల్లించేందుకు సిద్ధముగా ఉన్నారు. ఆ తదనురి తదనుగుణంగా రిజిస్ట్రేషన్ చేయుంకొని పరిపూర్ణమైన విక్రయ దస్తావేజు పొందుటకు సిద్ధంగా ఉన్నారు. కావున భవిష్యత్తులో ఎలాంటి అభ్యంతరములు, ఆటంకములు లేకుండా ఉండుటకు గాను ఇదే నోటీస్ ద్వారా కోరునది ఏమనగా, ఈ దిగువ నోటీసు షెడ్యూల్ భూమిపై ఎవరికైనా హక్కులు గాని, అభ్యంతరములు, ఆక్షేపణలు గానీ ఉన్నచో ఈ తారీఖు నుండి (7) ఏడు రోజుల లోపల, మాకు వ్రాత పూర్వకంగా తగిన ఆధారాలతో తెలియపరచగలరు. లేనిచో ఎవరికైనా, ఎలాంటి హక్కులు, ఆక్షేపణలు, అభ్యంతరాలు లేవని భావించి, పైన తెలిపిన విక్రయ అగ్రిమెంట్ ప్రకారంగా మిగతా క్రయ ధనం చెల్లింపు చేసి పరిపూర్ణమైన విక్రయ దస్తావేజు పొందగలరు. కావున ఆ తదనురి వచ్చిన ఎలాంటి అభ్యంతరాలు గానీ స్వీకరించబడవు మరియు ఆ తదనురి కష్ట, నష్టములకు వారే బాధ్యులు కాగలరు.

నోటీస్ షెడ్యూల్డు భూమి

ఆస్తి వివరములు :- జిల్లా రిజిస్ట్రారు నల్గొండ, తహశీల్దారు & జాయింట్ సబ్ రిజిస్ట్రార్ మర్రిగూడ వారి ఆజమాయిషీ లోనిది, జిల్లా పరిషత్ సూర్యాపేట, మండల పరిషత్ మర్రిగూడ, రెవిన్యూ గ్రామము మర్రిగూడ శివారులో 1వ వారి సర్వే నెం. 247/1/2, 248/1/2 లలో మొత్తము విస్తీర్ణము ఎ.11-00 గుం.లు, 2వ వారి సర్వే నెం. 247/1/1, 248/1/1లలో మొత్తము విస్తీర్ణము. ఎ.8-08 గుం,లు మరియు 3వ వారి సర్వే నెం. 249/2లో విస్తీర్ణము ఎ.2-13 గుం.లు ఈ విధముగా మొత్తము విస్తీర్ణము. ఎ.21-19 గుంటలు గల వ్యవసాయ భూమి ఈ దిగువ హద్దులు ఉన్నవి. హద్దులు : ఉత్తరము : ముసుందాపురం రోడ్డు (బాటు), దక్షిణము : సారెడ్డి వెంకటరెడ్డి గారి భూమి, తూర్పు: రచ్చ గోపయ్య గారి భూమి, పడమర : పాశం పాపయ్య గారి భూమి.

ఇట్లు :
గ్రంథి వెంకటేశ్వర్లు, బి.ఏ.ఎల్.ఎల్.బి.
గడ్డల శ్రీనివాస్, బి.ఏ.ఎల్.ఎల్.బి.
గ్రంథి శ్రీకాంత్, బి.ఇ.ఎల్.ఎల్.బి.
అడ్వకేట్స్, సూర్యాపేట.
సెల్ నెం. 9440574136

## 'విద్యార్థుల బంగారు భవితకు పదో తరగతి పునాది'

చింతలపాలెం, ఫిబ్రవరి 5: విద్యార్థుల బంగారు భవితకు పదో తరగతి పునాది అని వరల్డ్ రికార్డ్ ఇన్ మైండ్ పవర్ మోటివేషనల్ స్పీకర్ వేణుగోపాల్ అన్నారు. జై హనుమాన్ స్పోర్ట్స్ క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం చింతలపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండలంలోని పలు పాఠశాలల పదో తరగతి విద్యార్థులకు పబ్లిక్ ఎగ్జామ్స్ పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను పెట్టుకొని వాటి సాధనకు కృషి చేయాలన్నారు. అనంతరం ప్రతి పాఠశాలకు చెందిన ముగ్గురు మెరిట్ విద్యార్థులకు మెడల్స్, స్టడీ మెటీరియల్స్ అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ భూపాల్ రెడ్డి, ఎస్ఐ అంతిరెడ్డి, ఎంఈఓ శ్రీనివాస్ రావు, గాయత్రి కళాశాల జోనల్ ఇన్‌ఛార్జి రామినేని ప్రసాద్, పలు పాఠశాలల ఉపాధ్యాయులు వేణు, పవన్, వెంకటేశ్వరరావు, జై హనుమాన్ స్పోర్ట్స్ క్లబ్ అధ్యక్షుడు నాగిరెడ్డి, కార్యదర్శులు శ్రీకాంత్, హనుమంతరావు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## జాతర పనులను అధికారులు సమన్వయంతో చేపట్టాలి

● కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

లింగమంతుల స్వామి ఆలయ ప్రాంగణాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

చివ్వెంల, ఫిబ్రవరి 5: అధికారులు సమన్వయంతో పనిచేసి పెద్దగట్టు జాతర పనులను పూర్తి చేయాలని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ ఆదేశించారు. బుధవారం పెద్దగట్టు లింగమంతుల స్వామి ఆలయ ప్రాంగణంలో జాతర ఏర్పాట్లపై జిల్లా అధికారులతో నిర్వహించిన సమీక్షలో ఆయన పాల్గొని మాట్లాడారు. పోలీస్ సిబ్బంది బందోబస్తు ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలని, సీసీ కెమెరాల ఏర్పాటు, పార్కింగ్ ప్రదేశాల వద్ద ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక సిబ్బందిని కేటాయించాలని డీఎస్పీ రవికి సూచించారు. దేవస్థానం చుట్టూ ఉన్న వ్యవసాయ భూముల్లో పార్కింగ్, తాత్కాలిక బస్టాండ్లు, మరుగుదొడ్ల నిర్మాణం, మహిళలకు డ్రెస్సింగ్ రూమ్‌లు ఏర్పాటు చేయాలని ఆర్డీఓ వేణుమాధవ్‌కు సూచించారు. బస్సులు అన్ని మార్గాల్లో సులువుగా వెళ్లి వచ్చేలా ఆర్టీసీ సిబ్బంది చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ రాంబాబు, ఆలయ చైర్మన్ పోలబోయిన నర్సయ్య యాదవ్, ఆర్డీఓ వేణుమాధవ్, సీపీఓ కిషన్, డీఎస్పీ రవికుమార్, డీఎంహెచ్ఓ కోటాచలం, డీపీఓ నారాయణ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్, ఈఓ కుశలయ్య, ఏఓ సుదర్శన్‌రెడ్డి, సూపరింటెండెంట్ పద్మారావు, తాసీల్దార్లు కృష్ణయ్య, శ్యాంసుందర్‌రెడ్డి, పంచాయతీ రాజ్ ఈఈ మాధవి, ఆర్టీసీ డీఎం సుందర్, ఏఈఈలు రాహుల్, శ్రీనివాసరావు, కరుణాకర్ రెడ్డి, సురేశ్‌రెడ్డి, నారాయణ, అఖిల భారత యాదవ సంఘం జిల్లా అధ్యక్షుడు మర్యాద సైదులు తదితరులు పాల్గొన్నారు.

### ట్రాన్స్‌జెండర్లకు ప్రాధాన్యం : కలెక్టర్

సూర్యాపేట: ట్రాన్స్‌జెండర్లకు అన్నిచోట్లా ప్రాధాన్యం కల్పిస్తామని కలెక్టర్ అన్నారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ట్రాన్స్‌జెండర్ల సమస్యలపై అధికారులు, ట్రాన్స్‌జెండర్లతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. ట్రాన్స్‌జెండర్ల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక నోడల్ అధికారిగా జిల్లా సంక్షేమ అధికారిని నియమిస్తామని చెప్పారు. ఆధార్ కార్డులో మార్పులు చేయడానికి ప్రత్యేక క్యాంప్‌లు ఏర్పాటు చేయాలని ఈడీఎంను ఆదేశించారు. గుర్తింపు కార్డుల కోసం నేషనల్ పోర్టల్ ఫర్ ట్రాన్స్‌జెండర్ పర్సన్స్ అనే పోర్టల్ ద్వారా ఆన్‌లైన్‌లో ఎప్పుడైనా దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. ఈ సమావేశంలో జిల్లా సంక్షేమ అధికారి కె. నర్సింహారావు, లీడ్ బ్యాంక్ మేనేజర్ బాపూజీ, సీడీపీఓ రూపా, మిషన్ శక్తి కోఆర్డినేటర్ చైతన్య తదితరులు పాల్గొన్నారు.

## తాగునీటి కోసం గిరిజనుల తిప్పలు

వ్యవసాయ బోర్ల నుంచి తాగునీటిని పట్టుకొస్తున్న మహిళలు

నేరేడుచర్ల, ఫిబ్రవరి 5: తాగునీటి కోసం గిరిజనులకు తిప్పలు తప్పడం లేదు. దూర ప్రాంతం నుంచి నీటిని తెచ్చుకొని అవసరాలు తీర్చుకుంటున్నారు. మండలంలోని పులగంబండా తండాను గత బీఆర్ఎస్ ప్రభుత్వం నూతన గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేసింది. సర్పంచుల పదవీ కాలం ముగిసి నెలలు గడుస్తున్నా ప్రభుత్వం ఎన్నికలను నిర్వహించలేదు. దీంతో ప్రత్యేకాధికారుల పాలనలో గ్రామాల్లో సమస్యలు తాండవిస్తున్నాయి. సరిపడా నిధులు లేక సమస్యలపై అధికారులు స్పందించడం లేదు. బోరు మోటార్ కాలిపోయి పులగంబండా తండాలో గత 5 రోజులుగా తాగునీటికి ఇబ్బందులు పడుతున్నా పట్టించుకోవడం లేదు. గత్యంతరం లేక గిరిజన మహిళలు, చిన్నారులు పొలం గట్లపై నుంచి నడుచుకుంటూ వెళ్లి అతికష్టంపై వ్యవసాయ బోర్ల నుంచి తాగునీరు తెచ్చుకునే పరిస్థితి ఏర్పడింది. మోటార్‌కు మరమ్మతులు చేపట్టాలని అనేకసార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించాలని వారు కోరుతున్నారు.

### సమస్యను పరిష్కరిస్తాం - అరుణశ్రీ, పంచాయతీ కార్యదర్శి

నేను బాధ్యతలు స్వీకరించిన ఆరు నెలల్లోనే నాలుగు సార్లు మోటార్ కాలిపోతే మరమ్మతులు చేయించాం. కొందరు రాత్రి సమయంలో మోటార్ బాక్స్‌కు వేసిన తాళం పగులగొట్టి మోటార్ ఆన్ చేస్తున్నారు. రాత్రి, పగలు తేడా లేకుండా నిరంతరం నడవడంతో మోటార్ కాలిపోతున్నది.మోటార్ మరమ్మతులు చేయించి నీటి సమస్య లేకుండా చూస్తాం.

## సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన

మునగాల, ఫిబ్రవరి 5: మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో బుధవారం పోలీస్ శాఖ ఆధ్వర్యంలో సైబర్ నేరాల నియంత్రణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా సైబర్ క్రైమ్ ఇన్‌చార్జి డీఎస్పీ శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ.. ప్రజలు అత్యాశకు పోయి సైబర్ కేటుగాళ్ల చేతుల్లో డబ్బులు పోగొట్టుకుంటున్నారని అన్నారు. విద్యార్థులు తమ తల్లిదండ్రులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించాలని, అప్పుడే నేరాలను నియంత్రించొచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో సీఐ రామకృష్ణారెడ్డి, ఎస్ఐ ప్రవీణ్ కుమార్, ఏఎస్ఐ శ్రీనివాసరెడ్డి, ప్రిన్సిపాల్ బూర సైదయ్య గౌడ్, విద్యార్థులు పాల్గొన్నారు.

నడిగూడెం: సైబర్ మోసాల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మండల కేంద్రంలోని గురుకుల పాఠశాల విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఏఎస్ఐ చిన్న మల్సూర్ తదితరులు పాల్గొన్నారు.

## న్యాయవాదిపై దాడిని ఖండిస్తూ నిరసన

నిరసన వ్యక్తం చేస్తున్న న్యాయవాదులు

సూర్యాపేట లీగల్, ఫిబ్రవరి 5: హనుమకొండలో న్యాయవాది గంధం శివపై గత సోమవారం ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ చేసిన దాడిని ఖండిస్తున్నామని సూర్యాపేట బార్ అసోసియేషన్ సభ్యులు అన్నారు. న్యాయవాదిపై దాడిని నిరసిస్తూ బుధవారం జిల్లా కోర్టు ఎదుట రాస్తారోకో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ఉప కార్యదర్శి పి.వాణి, న్యాయవాదులు వీరేశ్, బి.విజయ్ కుమార్, ధర్మార్జున్‌రెడ్డి, సీహెచ్.చంద్రకాంత్, ఉప్పలయ్య తదితరులు పాల్గొన్నారు.

## 'కార్పొరేట్ శక్తులకు కొమ్ముకాస్తున్న కేంద్రం'

దిష్టిబొమ్మను దహనం చేస్తున్న సీపీఎం నాయకులు

మునగాల, ఫిబ్రవరి 5: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ కార్పొరేట్ శక్తులకు కొమ్ముకాసేలా ఉందని సీపీఎం మండల కార్యదర్శి బుర్రి శ్రీరాములు ఆరోపించారు. కేంద్ర బడ్జెట్‌ను నిరసిస్తూ బుధవారం మండల కేంద్రంలో సీపీఎం ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బడ్జెట్ రైతులకు, వ్యవసాయ కూలీలకు, కార్మికులకు వ్యతిరేకంగా ఉందని విమర్శించారు. వ్యవసాయ రంగాన్ని పూర్తిగా విస్మరించారని, ఉపాధి హామీ పథకానికి తగినన్ని నిధులు కేటాయించలేదని, విద్య, వైద్యం, ఉపాధి రంగాలకు ప్రాధాన్యం ఇవ్వలేదని అన్నారు. నాయకులు షేక్ సైదా, విజయలక్ష్మి, స్వరాజ్యం, చందా చంద్రయ్య, వెంకట్‌రెడ్డి, కృష్ణారెడ్డి, స్టాలిన్‌రెడ్డి, వెంకటాద్రి, సైదులు, లింగయ్య పాల్గొన్నారు.

## 'వాహనదారులు సరైన పత్రాలను కలిగి ఉండాలి'

వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ ఎస్ఐ మల్లేశ్

కోదాడ టౌన్, ఫిబ్రవరి 5: వాహనదారులు సరైన ధ్రువపత్రాలు, డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని కోదాడ పట్టణ ట్రాఫిక్ ఎస్ఐ మల్లేశ్ సూచించారు. బుధవారం కోదాడలోని బీఎస్ఎన్ఎల్ ట్యాక్సీ స్టాండ్ వద్ద వాహనదారులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వాహనాలు నడిపేటప్పుడు తప్పక హెల్మెట్ ధరించాలని, డ్రైవింగ్ లైసెన్స్, వాహనాల ధ్రువపత్రాలను దగ్గర ఉంచుకోవాలని సూచించారు. పెండింగ్ చలాన్లను చెల్లించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐలు శ్రీనివాసరావు, ఖయ్యూం, హోంగార్డులు తిరుపతి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## యాప్‌లో పెట్టుబడుల పేరుతో మోసం

● ఐదుగురు నిందితుల అరెస్ట్

మునగాల, ఫిబ్రవరి 5: యాప్‌లో పెట్టుబడి పెడితే తక్కువ రోజుల్లో ఎక్కువ డబ్బులు సంపాదించొచ్చని చెప్పి ప్రజలను మోసం చేసిన ఐదుగురిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ రామకృష్ణారెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏనుగుల శంకర్, బేతం ప్రభాకర్, గండు యల్లయ్య(అజయ్), రెడ్డిపల్లి బుచ్చిబాబు, కేతావత మూన్‌సింగ్ అనే ఐదుగురు అలీన్, శంకర్‌రావు అనే వ్యక్తుల సూచనలతో సూర్యాపేట, కోదాడ, హుజూర్‌నగర్, మిర్యాలగూడ, కూసుమంచి పట్టణాల్లో ఆర్‌జీ యాప్ పేరుతో ఆఫీసులు తెరిచి, యాప్‌లో ప్రజలతో పెద్ద ఎత్తున పెట్టుబడులు పెట్టించి బోర్డు తిప్పేశారని తెలిపారు. నిందితులను అరెస్ట్ చేసి వారి నుంచి రూ.3,50,000 నగదు, 5 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.

## నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

హుజూర్‌నగర్, ఫిబ్రవరి 5: పట్టణంలో విద్యుత్ తీగల పనులు చేపడుతున్న దృష్ట్యా గురువారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు గాంధీపార్క్, పీర్ల కొట్టం, లింగగిరి రోడ్డు, గోవిందపురం, రెడ్డి బజార్ ఏరియాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ రాంప్రసాద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

## 'కనీస వేతనం చెల్లించాలి'

మేళ్లచెర్వు, ఫిబ్రవరి 5: అసంఘటిత రంగ కార్మికులకు కనీస వేతనం చెల్లించాలని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు వట్టెపు సైదులు డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. రోజురోజుకూ పెరుగుతున్న నిత్యావసర సరుకుల ధరలతో సామాన్య మానవుడు జీవనం సాగించలేకపోతున్నాడన్నారు. గ్రామ పంచాయతీలు, సిమెంటు పరిశ్రమల్లో పనిచేసే తాత్కాలిక కార్మికులను పర్మినెంట్ చేయాలన్నారు. సమావేశంలో నాయకులు ఖాశీం, సైదులు పాల్గొన్నారు.

## టీబీ బాధితులకు పౌష్టికాహార కిట్లు పంపిణీ

నేరేడుచర్ల, ఫిబ్రవరి 5: నేరేడుచర్ల వాసవీ, వనితా క్లబ్బుల ఆధ్వర్యంలో ఇద్దరు టీబీ బాధితులకు బుధవారం ఆయా క్లబ్బుల జిల్లా గవర్నర్ రాచకొండ విజయలక్ష్మి ఆధ్వర్యంలో నిక్షయ్ మిత్ర పౌష్టికాహార కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. టీబీ బాధితుల్లో పౌష్టికాహార లోపం నివారించడానికి ఆరు నెలలు పాటు ఈ కిట్లను అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి నాగిణి, క్లబ్ జిల్లా సెక్రటరీ బిక్కుమల్ల కృష్ణ, వెంపటి శబరినాథ్, అరుణకుమారి, వీరవెల్లి శ్రీలత, కొత్త లక్ష్మణ్, ఈగ శ్రీనివాస్, జ్యోతి, కుంకు శ్రీనివాస్, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## గరిడేపల్లి పీహెచ్‌సీ తనిఖీ

గరిడేపల్లి, ఫిబ్రవరి 5: గరిడేపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం జిల్లా అధికారుల బృందం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలోని రికార్డులను, రిజిస్టర్లను పరిశీలించారు. అనంతరం అబ్బిరెడ్డిగూడెం సబ్ సెంటర్‌ను తనిఖీ చేశారు. రిజిస్టర్ల నిర్వహణ, అందిస్తున్న సేవలపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో స్టాటిస్టికల్ ఆఫీసర్ వీరయ్య, హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీదేవి, వ్యాక్సిన్ కోల్డ్ చైన్ మేనేజర్ లతీఫ్, మండల వైద్యాధికారి నరేశ్, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ పోలింగ్ కేంద్రం పరిశీలన

తిరుమలగిరి, ఫిబ్రవరి 5: తిరుమలగిరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని ఎమ్మెల్సీ పోలింగ్ కేంద్రాన్ని తాసీల్దార్ హరిప్రసాద్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా పోలింగ్ కేంద్రంలో మౌలిక వసతులను పరిశీలించారు. తాసీల్దార్ వెంట ఆర్ఐ మగ్ధం బాబా ఉన్నారు.

## ఆపరేషన్ స్మైల్‌లో 197 మంది బాలల గుర్తింపు : ఎస్పీ

సూర్యాపేట టౌన్, ఫిబ్రవరి 5: జిల్లాలో జనవరి నెలలో ఆపరేషన్ స్మైల్ కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించామని ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్ తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఈ కార్యక్రమం ద్వారా జిల్లావ్యాప్తంగా నిరాదరణకు, వెట్టిచాకిరీకి గురవుతున్న 197 మంది బాలలను గుర్తించి తల్లిదండ్రులకు, సంరక్షకులకు అప్పగించినట్లు వెల్లడించారు. పోలీసులు,